సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 25 । మే । 2025

గాలివాన బీభత్సం


కారుపై విరిగిపడ్డ చెట్టు

ధర్మారం(ధర్మపురి): వివిధ గ్రామాల్లో శుక్రవారం రాత్రి కురిసిన గాలివానతో చెట్లు విరిగిపడ్డాయి. మామిడికాయలు నేలరాలాయి. రెండురోజులుగా సాధారణ వర్షం కురుస్తుండడంతో రైతులు కాయలను విక్రయించడానికి సిద్ధమవుతున్నారు. అయితే రాత్రి కురిసిన గాలివానతో మామిడికాయలు నేల రాలిపోయాయి. ధర్మారం శివారులో చెట్టు విరిగి పార్కుచేసిన కారుపై పడింది.

ఇంటిపై పిడుగుపాటు

ఎలిగేడు(పెద్దపల్లి): ధూళికట్టలో పిడుగుపాటుకు ఇరుగురాల లచ్చయ్యకు చెందిన పెంకుటిల్లు ధ్వంసమైంది. టీవీ, ఫ్రిజ్, ఫ్యాన్లు కాలిపోయాయి. బొందయ్యకు చెందిన భవనం భీము పాక్షికంగా దెబ్బతిన్నది. టీవీ కాలిపోయింది.

న్యూస్‌రీల్

సజావుగా ధాన్యం కొనుగోళ్లు


ధాన్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ వేణు ఆదేశించారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్, రాఘవపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఏఎంసీలో ఇప్పటివరకు 13,500క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రాఘవపూర్‌లో అదనంగా హమాలీలను నియమించి రెండుమూడ్రోజుల్లో పూర్తిచేయాలని సూచించారు. కాగా, జూన్ 25న చేపట్టే గ్రామపాలన అధికారి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని వేణు సూచించారు. సకాలంలో ప్రశ్నాపత్రాలు పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉదయం 10 గంటలకు గేటు మూసివేశాక అభ్యర్థులను లోనికి అనుమతించవద్దని అన్నారు. ఆర్డీవో గంగయ్య, కలెక్టరేట్ సీ– వి భాగం సూపరింటెండెంట్ ప్రకాశ్ పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో పేషెంట్ల రద్దీ


రిజిస్ట్రేషన్ కోసం వేచిఉన్న అవుట్ పేషెంట్లు

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వ, మాతా శిశు కేంద్రం ఆస్పత్రుల్లో శనివారం పేషెంట్లు బారులు తీరారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందేందుకు వచ్చేవారు వెంట తెచ్చుకున్న ఆధార్‌కార్డును చూపి ఓపీ రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ఇలా బారులు దీరారు. ప్రతీరోజు సుమారు 800మందికిపైగా ఓపీ రిజిస్ట్రేషన్ అవుతోందని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు.

ఐటీఐ కోర్సుల్లో ఉచిత శిక్షణ

రామగుండం: పట్టణంలోని ఐటీఐలో ఉచిత షార్ట్‌టర్మ్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సురేందర్, శిక్షణ అధికారి విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన(పీఎంఎస్‌జీఎంబీ) పథకంలో భాగంగా వారంరోజులపాటు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. శిక్షణ విజయవంతంగా పూర్తిచేశాక పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి స్కిల్ డెవలప్‌మెంట్ ధ్రువీకరణపత్రం అందజేయనున్నామని వారు పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు రెండురోజుల్లోగా తమ వివరాలను నేరుగా ఐటీఐకి వచ్చి నమోదు చేసుకోవాలని వారు సూచించారు.

కొత్త పద్ధతులు అవలంబించాలి


మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేలా కొత్త పద్ధతులు పాటించాలని ఏడీఏ శ్రీనాథ్, కూనారం వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త శ్రీధర్ రైతులకు సూచించారు. తారుపల్లి గ్రామంలో శనివారం రైతు ముంగిట వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. విత్తన ఎంపిక, కొనుగోలు, శుద్ధి, శాస్త్రీయ సాగు పద్ధతులు, ఎరువులు, సాగునీటి యాజమాన్యం, నేల, మట్టి ఆరోగ్యాన్ని కాపాడుకునే విధానాలపై అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట సాగు, సేంద్రియ ఎరువుల వినియోగం, సస్యరక్షణ పద్ధతులు, హైబ్రిడ్ విత్తనాల సాగు, పత్తి, వరి, మిరప, అపరాల సాగు. అంతరపంటల సాగు ఏ కార్తెలో ఏ పంటలు వేయాలనే అంశాలపై వారు సమగ్రంగా వివరించారు. ఏవో నాగార్జున, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ సబ్బని రాజమల్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, ఏఈవో స్పందన, రైతులు తదితరులు పాల్గొన్నారు.

30లోగా ఆస్తిపన్ను చెల్లించండి

కోల్‌సిటీ(రామగుండం): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26)లో ఆస్తిపన్నుపై అపరాధ రుసుం వసూలు చేయడం లేదని, ఈ అవకాశం జూన్ 30 వరకే ఉందని రామగుండం బల్దియా కమిషనర్(ఎఫ్ఏసీ) అరుణశ్రీ తెలిపారు. ఈమేరకు ఇంటింటికీ ఆస్తిపన్నుల డిమాండ్ నోటీసులు జారీచేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ మరో మూడురోజుల్లో పూర్తిచేస్తామని పేర్కొన్నారు. డిమాండ్ నోటీస్ రాకున్నా.. ఆన్‌లైన్‌లో లేదా నగరపాలక సంస్థ కార్యాలయం, మీ సేవా కేంద్రాలు, ఇంటివద్దకు వచ్చే వార్డు అధికారులకు ఆస్తిపన్ను చెల్లించాలని ఆమె సూచించారు. గడువు ముగిశాక రెండుశాతం పెనాల్టీ విధిస్తామన్నారు. నగరం పరిధిలో ప్రభుత్వ, ప్రభుత్వేతర ఆస్తులు 51,014 ఉండగా 15,176 ఆస్తుల ఆస్తిపన్ను ఇప్పటివరకు చెల్లించారని తెలిపారు. మిగిలిన వారు వెంటనే ఆస్తిపన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు.

సాక్షి Special Story

పాలన.. పనితీరు.. ప్రత్యేకం!

ఒక్కో కలెక్టర్‌ది.. ఒక్కో ప్రత్యేకత

పాలనలో తమదైన ముద్ర వేస్తున్న ఐఏఎస్‌లు

ప్రజల్లో మమేకమవుతూ.. ముందుకెళ్తున్న జిల్లా బాస్‌లు

ఎంతో మంది కలెక్టర్లు వస్తుంటారు, పోతుంటారు. కానీ.. కొందరు కలెక్టర్లు మాత్రమే చెరగని ముద్ర వేస్తారు. ప్రజా సమస్యలను సత్వరం ఎలా పరిష్కరించవచ్చో, పారదర్శకంగా పనిచేస్తే ఎలాంటి ఫలితాలొస్తాయో చేసి చూపిస్తున్నారు ఉమ్మడి జిల్లా కలెక్టర్లు. పాలనలో తమదైన ముద్ర వేస్తూ.. పనితీరుతో ప్రజలను ఫిదా చేస్తున్నారు. ఉద్యోగులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ, అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేయడంలో విజయం సాధిస్తున్నారు. తమ పరిధిలోని మారుమూల పల్లెలను సైతం చుట్టేసివస్తున్నారు. పలు సందర్భాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, పథకాల అమలు తీరును ప్రత్యక్షంగా పరిశీలించి, అధికారులకు మార్గదర్శనం చేస్తున్నారు. అధికారులు, ఉద్యోగుల అవినీతి, విధుల పట్ల ఉదాసీనతపై కఠిన చర్యలతో హడలెత్తిస్తున్నారు. ముఖ్యంగా ఒక్కో కలెక్టర్ ఒక్కో అంశాన్ని ప్రత్యేకంగా తీసుకుంటూ, బాధ్యతలు స్వీకరించిన ఏడాదిలోపే పాలనలో ప్రత్యేకత చూపిస్తున్నారు.

–సాక్షి, పెద్దపల్లి/సిరిసిల్ల/జగిత్యాల


పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష


పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆశీర్వాదం తీసుకుంటున్న నూతన వధూవరులు

హడలెత్తిస్తూ.. ఆదర్శంగా నిలుస్తూ..

పెద్దపల్లి కలెక్టర్‌గా కోయ శ్రీహర్ష 2024 జూన్ 16న బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి అధికారులతో రివ్యూలు నిర్వహిస్తూనే, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పాలనను పరుగులు పెట్టించారు. స్కూళ్లు, ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, కార్పొరేషన్, తహసీల్దార్ కార్యాలయాలను సందర్శిస్తూ, స్థానిక సిబ్బంది సూచనలు స్వీకరిస్తూనే అధికారులుగా వారేం చేయాలో దిశానిర్దేశం చేస్తున్నారు. విధులకు డుమ్మాకొట్టిన వారు, అలసత్వం వహించేవారు, అవినీతికి పాల్పడే అధికారులను సుమారు ఆరుగురిని సస్పెండ్ చేశారు. ముఖ్యంగా జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రులను ఆకస్మిక తనిఖీలతో గాడినపెట్టారు. గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో తన సతీమణి విజయకు ప్రతి నెలా పరీక్షలు చేయిస్తూ, డెలివరీ చేయించి ఆదర్శంగా నిలిచారు. తద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలను ప్రజలందరూ ఉచితంగా వినియోగించుకోవాలనే బలమైన సందేశాన్ని ఇచ్చారు. వృద్ధాప్య దశలో ఉన్న ఓ తండ్రిని పట్టించుకోని కొడుక్కి కలెక్టర్ ఝలక్ ఇచ్చారు. కొడుకు పేరిట తండ్రి చేసిన ఆస్తి గిఫ్ట్ డీడ్‌ను తిరిగి తండ్రి పేరుపైకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. తాజాగా తబిత ఆశ్రమంలో మానస అనే అనాథ యువతికి పెళ్లిపెద్దగా వ్యవహరించి, అధికారులను సమన్వయం చేస్తూ అంగరంగా వైభవంగా వివాహం జరిపించడం ద్వారా జిల్లావాసుల మన్ననలు పొందారు.





అమ్మకు ఆరోగ్యం.. పిల్లలకు చదువు..

కలెక్టర్లు సాధారణంగా సమీక్ష సమావేశాలు నిర్వహించడం, ఫైళ్లు క్లియర్ చేయడం, విజిట్స్, ఇతర కార్యకలాపాలతో బిజీగా గడుపుతారు. కానీ.. కరీంనగర్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పమేలా సత్పతి మాత్రం మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడమే కాకుండా, చిన్నారుల మానసిక వికాసం కోసం 'ఏ టూ జెడ్ నాణ్యమైన రైమ్' పేరిట రైమ్ రాసి పిల్లల కోసం పాడారు. ప్రతీ అక్షరం ప్రాముఖ్యతను తెలిపేలా.. ఏ ఫర్ ఆక్టివ్, బీ ఫర్ బ్రైట్.. అంటు జెడ్ వరకూ అన్ని అక్షరాలను ఉపయోగించి రైమ్ విడుదల చేశారు. అలాగే 'శుక్రవారం సభ' పేరుతో మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పోషణలోపం గల చిన్నారులు, రక్తహీనత ఉన్న మహిళల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టేలా చర్యలు తీసుకున్నారు. ఉచిత పరీక్షల ద్వారా మహిళలకు ఆరోగ్య సమస్యలు దరిచేరకుండా భరోసా ఇస్తూ చేపట్టిన కార్యక్రమం అద్భుత ఫలితాలను సాధించింది. అలాగే జిల్లాలో ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికుల కుటుంబాల కోసం ప్రత్యేక పాఠశాలను ప్రారంభించి సుమారు 500 మంది వలసకార్మికుల పిల్లలకు బోధన అందించి తనదైన తల్లి పాలనతో ఆకట్టుకుంటున్నారు.


విద్యార్థినులకు షూస్ పంపిణీ చేస్తున్న కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

ఉత్తీర్ణత పెంచుతూ.. ఉపాధి కల్పిస్తూ..


కొండగట్టు కోనేరులో అధికారులతో జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్



చదువు ఒక్కటే సమాజాన్ని ఉన్నత స్థితికి తీసుకెళ్తుందని గుర్తించిన జగిత్యాల కలెక్టర్‌గా సత్యప్రసాద్ 2024 జూన్ 16న బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి జిల్లాపై తనదైన ముద్ర వేస్తున్నారు. ముఖ్యంగా పదో తరగతి ఫలితాల్లో జగిత్యాల జిల్లాగా ఏర్పడిన అనంతరం హ్యాట్రిక్‌గా నిలిచింది. అనంతరం కరోనాతో అట్టడుగు స్థానానికి వెళ్లింది. రాష్ట్రస్థాయిలో మళ్లీ అగ్రస్థానంలో నిలబెట్టాలనే ఉద్దేశంతో విద్యార్థులతో ముఖాముఖీ, ప్రత్యేక క్లాసులు ఏర్పాటు చేయడంతో పాటు, ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించారు. దీంతో పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో నాల్గో స్థానంలో జగిత్యాల మళ్లీ నిలిచింది. ఎస్సీ స్టడీ సర్కిల్‌లో 200 మందికి ఉచితంగా కోచింగ్ ఇప్పించగా 60 శాతం మందికి ఉద్యోగాలు వచ్చాయి. ఆరుగురు గ్రూప్–1 జాబ్‌లు సాధించారు. అవసరమైన పిల్లలకు ఉచితంగా ల్యాప్‌టాప్స్ అందజేశారు. కొండగట్టు జయంతోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఎండ, వాన లెక్కచేయకుండా స్వామివారి సన్నిధిలో ఉంటూ రాత్రంతా భక్తులకు ఇబ్బందులు కలగకుండా తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులను సస్పెండ్ చేస్తూ పాలనలో తనదైన మార్క్ చూపెడుతున్నారు.



పాఠాలు బోధిస్తూ.. పనులు కల్పిస్తూ..

కలెక్టర్‌గా తనదైన మార్క్ చూపుతున్నారు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా. నిత్యం క్షేత్రస్థాయి పర్యటనలు, ఆకస్మిక తనిఖీలతో జిల్లాలో విద్య, వైద్య సేవలు సామాన్యులకు మెరుగ్గా అందేలా కృషి చేస్తున్నారు. పాఠశాలలను తరచూ తనిఖీ చేస్తూ, పిల్లలకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకున్నారు. అనేక సందర్భాల్లో ఉపాధ్యాయుడిగా మారి పాఠాలు బోధించారు. విద్యార్థులకు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. వేసవిలో ఉపాధ్యాయుల ప్రత్యేక శిక్షణ తరగతులకు వెళ్లి.. గురువులకే గురువుగా మారి బోధనాంశాల్లో మెలకువలు చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులతో మాట్లాడుతూ.. వారికి అందుతున్న సేవలపై ఆరా తీస్తూ, ప్రసూతి సేవలు అందేలా.. అనవసరపు సిజేరియన్లు చేయకుండా కట్టడి చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా బైపాస్ రోడ్డులో ట్రాన్స్‌జెండర్ల ఉపాధికి పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయించారు. అక్కడ లభించే రూ.10వేలతో తాము బతకలేమని ట్రాన్స్‌జెండర్లు పెట్రోల్ బంక్‌లో పని చేసేందుకు నిరాకరించారు. వెంటనే ఆ బంక్‌ను దివ్యాంగుల ఉపాధికి కేంద్రంగా మార్చారు. ప్రస్తుతం 16 మంది దివ్యాంగులు ఉపాధి పొందుతున్నారు. కొన్ని వివాదాలు ఆయన్ని చుట్టు ముట్టినా, అవేమీ లెక్కచేయకుండా తనదైన శైలిలో నిర్దేశించుకున్న లక్ష్యాల వైపు సాగుతున్నారు.


బాగా చదువుకోవాలని చిన్నారికి సూచిస్తూ..

పాతభవనం కూల్చివేత

- జేసీబీపై శిథిలాలు .. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు


జేసీబీ వాహనంపై పడిన భవనం శిథిలాలు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని మార్కండేయకాలనీ మెయిన్‌రోడ్డు రాజేశ్ థియేటర్ పక్కనున్న మూడంతస్తుల పాత భవనాన్ని మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం జేసీబీ సాయంతో కూల్చివేశారు. బల్దియా సీనియర్ సివిల్ కాంట్రాక్టర్ డి.రాజమల్లుకు చెందిన ఈ భవనం.. రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉందని, దానిని తొలగించాలని అధికారులు చాలా ఏళ్లుగా నోటీసులు జారీచేస్తూ వస్తున్నారు. అయితే, తనకు పరిహారం కావాలని 2002లో రాజమల్లు హైకోర్టును ఆశ్రయించారు. అప్పటినుంచి ఈ వివాదం ఎటూ తేలలేదు. ప్రస్తుతం వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉండడంతో కూల్చివేసేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్ణయించారు. ఇదే విషయాన్ని భవన యజమానికి తెలియజేశారని తెలిసింది. శనివారం టౌన్ ప్లానింగ్ అధికారి నవీన్, సిబ్బంది జేసీబీలతో కూల్చివేతలు చేపట్టారు. వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

హఠాత్తుగా కూలిన భవనం..

జేసీబీలకు అమర్చిన బ్రేకర్‌తో పిల్లర్లను కూల్చివేస్తుండగా భవనం భారీ శబ్దంతో కుప్పకూలింది. ఏంజరిగిందో తెలుసుకునేలోపే జేసీబీపై శిథిలాలు పడ్డాయి. స్వల్పగాయాలతో డ్రైవర్ కిందకు దూకి పరుగులుపెట్టాడు. విద్యుత్ స్తంభాలపై కూడా శిథిలాలు పడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భవనం వెనకాలే ఉన్న ఓ ఫాస్టఫుడ్ సెంటర్ బాత్‌రూంలు, సామగ్రి ధ్వంసమయ్యాయి. అయితే, ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, మరో రెండురోజుల వరకు ఈ ప్రాంతంలో రాకపోకలను నిలిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అయితే తమకు పరిహారం ఇవ్వకుండా భవనం కూల్చివేయడం సరికాదని యజమాని కుమారుడు ఆవేదన వ్యక్తం చేశారు.

సర్వేయర్లకు జేఎన్టీయూలో శిక్షణ

రామగిరి: జిల్లాకు తొలివిడతగా కేటాయించిన 125 మంది ప్రైవేట్ లైసెన్స్ సర్వేయర్లకు సెంటినరికాలనీ మంథని జేఎన్టీయూలో ఈనెల 26 నుంచి శిక్షణ ఇస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా లైసెన్స్ సర్వేయర్లకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలో 224 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, తొలివిడతగా 125 మందికి జేఎన్టీయూ లో శిక్షణ ఇవ్వడానికి ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు ఈనెల 26న ఉదయం 10 గంటలకు ఒరిజనల్ ధ్రువీకరణపత్రాలతో కళాశాలకు చేరుకోవాలని ఆయన సూచించారు.

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా అదనపు సెషన్స్ జడ్జి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

కోల్‌సిటీ(రామగుండం): ఉచిత న్యాయ సేవలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జిల్లా అదనపు సెషన్స్ జడ్జి శ్రీనివాసరావు సూచించారు. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. వరకట్న దురాచారం రూపుమాపడానికి, భ్రూణ హత్యలు అరికట్టడానికి, అవినీతి నిర్మూలించడానికి ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. క్షణికావేశంలోనే ఎక్కువ నేరాలు జరుగుతున్నాయని అన్నారు. వాటి నియంత్రణకు ప్రతీఒక్కరు తమ భావోద్వేగాలను, ఆవేశాలను నియంత్రించుకోవాలని కోరారు. ఎక్కువ సంఖ్యలో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించేందుకు తాను లీవులు ఎక్కువగా వినియోగించడం లేదని తెలిపారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో మున్సిపల్ కార్మికులు అందించిన సేవలను ప్రశంసించారు. న్యాయవాది జీవన్ గ్లోరీ మాట్లాడారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, న్యాయవాదులు గుడికందుల భూమయ్య, గోలి తిరుపతిరావు, ఆర్వో ఆంజనేయులు, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, మెప్మా సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంక్


సాత్విక

ధర్మారం(ధర్మపురి): పాలిసెట్ ఫలితాల్లో నందిమేడారం గ్రామానికి చెందిన పి.సాత్విక రాష్ట్రస్థాయిలో 7వ ర్యాంకు సాధించింది. ఓ ప్రైవేట్ హైస్కూల్‌లో టెన్త్ చదివిన సాత్విక టీజీఆర్‌జేసీలోనూ 2వ ర్యాంకు సాధించినట్లు కేవీఆర్ తెలిపారు. సాత్వికను కరస్పాండెంట్ జైన సురేశ్‌కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవి అభినందించారు.

'నకిలీ' గండం గట్టెక్కేనా?

- ఏటా అన్నదాతకు తప్పని తిప్పలు
- నకిలీ విత్తనాల కట్టడికి టాస్క్‌ఫోర్స్
- అధికారుల ముందస్తు తనిఖీలు
- అవగాహనతోనే నకిలీలకు అడ్డుకట్ట

సాక్షి, పెద్దపల్లి: ఈనెల 25న(ఆదివారం) రోహిణి కార్తె ప్రవేశిస్తుండడంతో వానాకాలం సీజన్ ప్రారంభమవుతుంది. ఇదే అదనుగా విత్తన మాయగాళ్లు పల్లెబాటపట్టి అన్నదాతలను బురిడీ కొట్టించేందుకు సిద్ధమవుతున్నారు. ఏటా నకిలీ, అనుమతి లేనివిత్తనాల విక్రయం పరిపాటిగా మారింది. కొన్ని కంపెనీలు తమ విత్తనాలకు బాగా డిమాండ్ ఉండాలనే లాభాపేక్షతో క్షేత్రస్థాయి ప్రదర్శన ఏర్పాటు చేసి రైతులను పిలిచి బిర్యానీలు పెట్టి బాగా పండిన పత్తి పంటను చూపించి తమ విత్తనంతోనే ఇంతలా దిగుబడి వచ్చిందనే భ్రమలు కల్పిస్తున్నాయి. దీంతో రైతులు ఆ విత్తనమే కావాలంటూ డీలర్లను కోరడంతో దళారులు అధిక ధరలకు విక్రయించడం, ఏదా కల్తీవి అంటగట్టడం సాధారణంగా మారుతోంది. ఉన్న వాటిని బ్లాక్ మార్కెట్‌కు తరలించి ధరలు పెంచి విక్రయిస్తున్నారు.

మోసాలను అరికట్టేందుకు..

విత్తనాల విషయంలో దళారుల మోసాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వ్యవసాయశాఖతోపాటు పోలీసు అధికారులతో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. కానీ, నకిలీ విత్తనాల సరఫరా, విక్రయాలను ఆశించిన స్థాయిలో టాస్క్‌ఫోర్స్ తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. నకిలీ విత్తనాలు మార్కెట్‌లో ప్రవేశించి.. రైతులకు విక్రయించాక గానీ దాడులు చేయడంలేదు. వానకాలంలో విత్తనాలు విక్రయిస్తారని తెలిసినా.. ముందస్తు సమాచారంతో దాడులు చేస్తే నకిలీ విత్తనాలను నిల్వచేసిన గోదాములను గుర్తించే వీలుంది. ప్యాకింగ్, విత్తన సేకరణ వంటి వాటిపైనా దృష్టి సారిస్తే నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి విడుదలకు, విక్రయాలకు ముందే అరికట్టే ఆస్కారముందని అన్నదాతలు చెబుతున్నారు.


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

కమీషన్‌లకు ఆశపడి

ఈ వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 2,76,076 ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలు పండిస్తారని అధికారులు అంచనాలు సిద్ధం చేశారు. వీటిలో 2,12,500 ఎకరాల్లో వరి, 52,500 ఎకరాల్లో పత్తి సాగుచేయనున్నారు. ఇందుకోసం 1,84,487 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని భావిస్తున్నారు. జిల్లాలో సుమారు 540 ఫెర్టిలైజర్ షాపులుండగా, అందులోని కొందరు వ్యాపారులు కమీషన్‌కు ఆశపడి దళారులతో చేతులు కలుపుతున్నారు. కొత్త వంగడమని చెబుతూ నకిలీ విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలను జిల్లాకు దిగుమతి చేసి రైతులకు అంటగడుతున్నారు. ప్రతీ వానాకాలం మాదిరిగానే ఈ సీజన్‌లోనూ లూస్ పత్తి సీడ్స్ విక్రయిస్తున్న తెలుస్తోంది. కొన్ని రకాల విత్తనాలు ఆకర్షణీయమైన రంగుల ప్యాకెట్లలో ప్యాక్‌చేసి విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఇలా ఫిర్యాదు చేయండి..

దళారుల గురించి ఎవరికి, ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలియక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అక్రమ వ్యాపారాలను అడ్డుకునేందుకు రైతులు ముందుకు రావాలి. అండగా టాస్క్‌ఫోర్స్ బృందాలు ఉన్నాయి. నకిలీ విత్తనాల విషయం తెలిసిన వెంటనే టాస్క్‌ఫోర్స్ అధికారులకు ఫోన్ చేసి సమాచారం అందించాలి. మిగతా విషయాలు వారు చూసుకుంటారు. నకిలీ విత్తనాలు, అధిక ధరలకు విక్రయించడం వంటివి చోటుచేసుకుంటే రైతులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేయాలి.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

- గ్రామాల్లో తిరుగుతూ తక్కువ ధరకు విత్తనాలు విక్రయిస్తామని ఎవరైనా చెబితే నమ్మకూడదు. లూస్ విత్తనాలు కొనుగోలు చేయొద్దు
- అనుమతి పొందిన డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలి
- విధిగా రసీదు తీసుకోలి. విత్తనసంచుల లాట్ నంబరు సరిచూసుకోవాలి
- సంచులపై క్యూఆర్‌కోడ్ ఉంటుంది. దాన్ని స్కాన్ చేసి పూర్తివివరాలు తెలుసుకోవచ్చు.
- పంటకాలం పూర్తయ్యే వరకూ బిల్లులు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి
- నకిలీవని తేలితే కొనుగోలు చేసిన బిల్లులను వ్యవసాయశాఖ అధికారులకు చూపి సంబంధిత వ్యాపారి ద్వారా పరిహారం పొందవచ్చు.

తనిఖీలు చేస్తున్నాం

నకిలీ విత్తనాలను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేశాం. జిల్లా, మండల స్థాయిల్లో దుకాణాలు, గోదాములను తనిఖీ చేస్తున్నాం. వ్యాపారులు నకిలీ, బీటీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవు. రైతులు కూడా విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి. లైసెన్స్ పొందిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి. ప్రతీకొనుగోలుకు బిల్లులో విత్తనం బ్యాచ్ నంబర్, కంపెనీ పేరు, తయారీ, ఎక్స్‌పైరీ తేదీలు, డీలర్ సంతకం ఉండేలా చూసుకోవాలి.

– ఆదిరెడ్డి, డీఏవో

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి


మల్లయ్య(ఫైల్)

పాలకుర్తి(రామగుండం): పుట్నూర్ గ్రామంలో టాటామ్యాజిక్ ఆటో ఢీకొని శ్రీరాముల మల్లయ్య(60) మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ధర్మారం మండలం రామయ్యపల్లి గ్రామానికి చెందిన టాటామ్యాజిక్ వాహనం బసంత్‌నగర్ వైపు వస్తుండగా మార్గమధ్యంలో పుట్నూర్ గ్రామశివారులోని గాంధీనగర్ వద్ద రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న మల్లయ్యను వెనుకనుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో మల్లయ్య తలకు తీవ్రగాయాలు కాగా వెంటనే పెద్దపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో డాక్టర్ల సూచన మేరకు కరీంనగర్‌లోని మరో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోని సుల్తానాబాద్‌లో మల్లయ్య మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు బసంత్‌నగర్ పోలీసులు కేసునమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎల్లారెడ్డిపేటలో గుర్తుతెలియని మహిళ..


మహిళ మృతదేహం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్ శివారులో రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని మహిళను స్కూటీ బలంగా ఢీకొట్టడంతో మృతిచెందింది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాలు.. వెంకటాపూర్‌లోని సిరిసిల్ల–కామారెడ్డి రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని మహిళను ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్లకు వెళ్తున్న స్కూటీ శుక్రవారం రాత్రి ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడ్డ మహిళను అదే గ్రామానికి చెందిన వాటర్‌పంపు మెకానిక్ మల్లాపురం వెంకటేశ్, అతని స్నేహితుడు మేకల మల్లయ్య సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఆ మహిళ మృతి చెందింది. ఈ సంఘటనపై వెంకటేశ్, మల్లయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్ వివరించారు.

బైక్ ఢీకొని వృద్ధుడు..

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్‌లో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో నర్ర బుచ్చయ్య(60) అనే వృద్ధుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి అతివేగంగా వెళ్తూ ఎక్సెల్ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఎక్సెల్‌పై ప్రయాణిస్తున్న వృద్ధుడు బుచ్చయ్య తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ తీసుకెళ్లగా మృతిచెందాడు. మృతికి కారణమైన పీసీ బాధిత కుటుంబంతో సంప్రదింపులు జరిపినట్లు స్థానికులు తెలిపారు.

సౌరశక్తి.. అనాసక్తి

- సూర్యఘర్ పథకంపై జిల్లావాసుల్లో నిరాసక్తత
- రాయితీ వర్తిస్తున్నా పట్టించుకోని వైనం
- ఉమ్మడి జిల్లాలో 465 దరఖాస్తులకు డబ్బు చెల్లించింది 131 మందే


ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ ఫలకలు

సాక్షి, పెద్దపల్లి: కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ప్రధానమంత్రి సూర్యఘర్ పథకానికి ఉమ్మడి జిల్లాలో స్పందన అంతంత మాత్రమే ఉంది. సౌరశక్తి ద్వారా విద్యుదుత్పత్తిని ప్రభుత్వం ప్రోత్సహించి, గృహాలు, ఆఫీస్‌లు, ఇతరత్రా సంస్థలు, అర్హులందరికీ రాయితీ కల్పిస్తున్నారు. అయినా ఆయా వర్గాల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదు. దీనిపై సంబంధిత సంస్థల నుంచి కొరవడిన ప్రచారంతో ప్రజల్లో సరైన అవగాహన ఉండడం లేదు. అణు, థర్మల్ విద్యుదుత్పత్తితో పర్యావరణానికి విఘాతం కలుగుతోంది. దీనిని నియంత్రించడంతోపాటు భవిష్యత్ డిమాండ్ నేపథ్యంలో సౌర విద్యుత్‌కు ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయి. గృహ వినియోగదారులకు అవసరమయ్యే విద్యుత్‌ను వారి ఇంటిపై సౌర ఫలకలు(సోలార్ ప్యానళ్లు) ఏర్పాటు చేసుకుని ఉత్పత్తి చేసుకునే వెసులుబాటు ఇచ్చింది. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుంటే దీర్ఘకాలికంగా అనేక ప్రయోజనాలు పొందవచ్చని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితం కానరావడం లేదు.

465 దరఖాస్తులకు..

ఉమ్మడి జిల్లాలో ఏప్రిల్ 30వ తేదీ నాటికి 589.4 మెగావాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తి చేసేందుకు 465 దరఖాస్తులు రాగా, అందులో కేవలం 131మంది మాత్రమే డబ్బులు చెల్లించారు. వీరిలో 109 మంది 134.7 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లను ఇళ్లపై ఏర్పాటు చేశారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నాక 'రోజుకు ఎంత విద్యుత్ ఉత్పత్తి అవుతుంది?, ఎంత వినియోగం ఉంటుంది?, గ్రిడ్‌కు ఎంత వెళుతుంది?' అనే సమాచారాన్ని 'నెట్‌మీటర్' యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఏమైనా మరమ్మతులు వస్తే కంపెనీ ప్రతినిధులు వచ్చి చేస్తారు. కేవలం గృహ అవసరాలకు మాత్రమే సోలార్ ప్లాంట్లు మంజూరు చేస్తారు. టీఎస్ రెడ్‌కో వీటిని ఏర్పాటు చేస్తుంది.

రూ.కోటి నజరానా

పీఎం సూర్యఘర్, ముఫ్త్, పీఎం కుసుమ్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల కింద రాయితీ ద్వారా సోలార్ ప్యానెళ్లను అమర్చుకునేలా ఆయా గ్రామాల్లోని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా ప్రతీ జిల్లాలో 5వేల కంటే ఎక్కువ జనాభా కలిగిన గ్రామాలను ప్రాథమికంగా ఎంపిక చేసి, ఆయా గ్రామాల్లో ఎక్కువ సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా పోటీని ప్రారంభించి ఆరు నెలలపాటు కొనసాగిస్తోంది. అత్యధికంగా సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేసుకునే గ్రామాన్ని జిల్లాస్థాయి కమిటీ 'మోడల్ సోలార్ విలేజ్‌గా' గుర్తించి రూ.కోటి ప్రోత్సాహం అందిస్తుంది. ఇందులో భాగంగా పెద్దపల్లిలో 21, జగిత్యాలలో 23 గ్రామాను ఎంపిక చేయగా, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ఎంపిక చేసేందుకు కసరత్తు జరుగుతోంది.

ఉమ్మడి జిల్లాలో సౌరశక్తి యూనిట్ల దరఖాస్తులు

జిల్లా	దరఖాస్తులు	ఈఎండీ	కెపాసిటీ (మెగావాట్లలో)
జగిత్యాల	117	31	33.7
కరీంనగర్	178	56	52.2
పెద్దపల్లి	90	13	16.8
సిరిసిల్ల	80	31	32
మొత్తం	465	131	134.7

అపోహలు వద్దు

సోలార్ పవర్‌తో విద్యుత్ బిల్లు భారీగా తగ్గుతుంది. తొలుత పెట్టుబడి ఎక్కువగా అనిపించినా.. భవిష్యత్‌లో ఊహించని ప్రయోజనం చేకూరుతుంది. సోలార్ రూఫ్ టాప్ విషయంలో ఎలాంటి అపోహలకు తావులేదు. – అజేయ్, డీఎం, రెడ్కో

తిరుపతి ఎట్లున్నడో?

- సీనియర్ సెంట్రల్ మిలిటరీ కమిషన్ సారథి
- తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ తల వెల రూ.కోటి
- పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లో మకాం?
- వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో కలవరం


తిప్పిరి తిరుపతి

కోరుట్ల: మావోయిస్టు కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ నేపథ్యంలో సెంట్రల్ మిలీషియా కమిషన్ మెంబర్.. మావోల కీలక దాడుల్లో వ్యూహకర్త.. మావోయిస్టు పార్టీలో సెకండ్ క్యాడర్‌లో ఉన్న కోరుట్లకు చెందిన తిప్పిరి తిరుపతి ఉరఫ్ దేవ్‌జీ ఎట్లున్నడో.. అన్న అంశం చర్చనీయాంశంగా మారింది. ఆపరేషన్ కగార్ కొనసాగుతున్న క్రమంలో ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్లలో మావోయిస్టులు మృతి చెందుతున్న విషయం తెల్సిందే. అయితే ఏ ఎన్‌కౌంటర్‌లో తిప్పిరి తిరుపతి ఎక్కడున్నా ఉన్నాడోనని స్థానికులు కలవరపడుతున్నారు.

ఆర్ఎస్‌యూ నేపథ్యమే..

కోరుట్లలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన తిరుపతి 1983లో డిగ్రీ చదువుతున్న క్రమంలో రాడికల్ స్టూడెంట్ యూనియన్ భావజాలానికి ఆకర్షితుడయ్యాడు. ఆ సమయంలో ఏబీవీపీ, ఆర్ఎస్‌యూ విద్యార్థి సంఘాల మధ్య గొడవలు సాధారణంగా జరుగుతున్న క్రమంలో పోలీసు కేసులు నమోదు అయ్యాయి. 1983 చివరలో తిరుపతి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. దళ సభ్యుడి స్థాయి నుంచి కమాండర్‌గా పనిచేసి అంచలంచెలుగా ఎదిగి ప్రస్తుతం మావోయిస్టు సెంట్రల్ కమిటీ మెంబర్‌గా, మిలీషియా దాడుల్లో వ్యూహకర్తగా సెకండ్ క్యాడర్ హోదాలో పనిచేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా ఏరియాల్లో తిప్పిరి తిరుపతిని దేవ్‌జీగా పిలుచుకుంటారు. మిలీషియా దాడులు జరిపి నిమిషాల్లో అక్కడి నుంచి తప్పించుకోవడం తిరుపతికి వెన్నతో పెట్టిన విద్యగా చెబుతారు. తిరుపతి సమీపంలోని అలిపిరిలో చంద్రబాబుపై జరిగిన దాడి ఘటనలో నంబాల కేశవరావుతో పాటు తిప్పిరి తిరుపతి పాత్ర ఉన్నట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. 2010లో దంతెవాడ సమీపంలో సెంట్రల్ రిజర్వ్ జవాన్లపై దాడి జరిపి 74 మంది మృతి చెందిన ఘటనకు సారథ్యం వహించింది ఇతడేనని పోలీసు వర్గాలు చెబుతాయి. ఆయన తలకు ఎన్ఐఏ రూ. కోటి రివార్డు ప్రకటించినట్లు సమాచారం.

ఎక్కడున్నడో ఏమో?

ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా ఏరియాల్లో మావోయిస్టు పార్టీ రిక్రూట్‌మెంట్‌లో కీలకంగా వ్యవహరించడంతోపాటు మిలటరీ శిక్షణ కేంద్రం నిర్వహణలోనూ తిరుపతి పాలుపంచుకున్నట్లు సమాచారం. ఆపరేషన్ కగార్ నేపథ్యంలో తిరుపతి తన స్థావరాలు మార్చుకుంటున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటీవల కొంత మంది మావోయిస్టు కీలక నేతలు పశ్చిమ బెంగాల్ సరిహద్దు ప్రాంతాల్లోకి వెళ్లి షెల్టర్ తీసుకుంటున్నట్లు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సీ భావిస్తోంది. వీరిలో తిప్పిరి తిరుపతి కూడా ఉంటాడన్న ప్రచారం జరుగుతోంది. ఈ మూడు నెలల వ్యవధిలో వందలాది మంది మావోయిస్టులు మృతి చెందుతున్న క్రమంలో తిరుపతి ప్రస్తావన రావడం గమనార్హం. ఇటీవల మెట్‌పల్లి డీఎస్పీ అడ్డూరి రాములు కోరుట్లలోని తిరుపతి ఇంటికి వెళ్లి అజ్ఞాతంలో ఉన్న అతడిని లొంగిపోయేలా చూడాలని ఆయన బంధువులను కోరడం గమనార్హం

మచ్చలేని నాయకుడిపై నిందలా?

- ఉద్దేశపూర్వకంగానే మంత్రి శ్రీధర్‌బాబుపై అక్కసు
- ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం విమర్శ



మాట్లాడుతున్న గజ్జెల కాంతం, నాయకులు

పెద్దపల్లిరూరల్: మచ్చలేని నాయకుడిగా, నీతి, నిజాయతీతో రాష్ట్రాభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ కుటుంబం నిందలు వేయడం మానుకోవాలని ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం హితవు పలికారు. స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సరస్వతీ పుష్కరాల ప్రచారంలో ఫ్లెక్సీపై ఎంపీ వంశీకృష్ణ ఫొటో ఏర్పాటు చేయలేదని శ్రీధర్‌బాబుపై అక్కసు వెళ్లగక్కడం సరికాదన్నారు. 30 ఏళ్ల యువకుడికి ఎంపీ టికెట్ ఇప్పించి గెలిపించిన నాయకుడిని ఎలా విమర్శిస్తారని మండిపడ్డారు. వివేక్ కుటుంబం కాంగ్రెస్ పార్టీకి చెడ్డ పేరు తెచ్చేలా ప్రవర్తించవద్దని, ఇప్పటికైనా కుల రాజకీయాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. వివేక్ పార్టీలు మారడంలో దిట్ట అని, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధును ఎక్కడ కలిశావో తనకు తెలుసుని అన్నారు. కాంగ్రెస్ పార్టీపై ఇష్టం ఉంటే పార్టీ కోసం పనిచేయాలని, లేకుంటే తనకు నచ్చిన పార్టీలోకి వెళ్లాలని సూచించారు. అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మల్యాల తిరుపతి, మంథని సత్యం, కర్ణ కృష్ణ, తోకల మల్లేశ్, ఇరుగురాల మహేందర్, బూడిద శంకర్, అక్కపాక సంపత్, సాట్ల అమరజ్యోతి, పులిపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్న ఆదాయ రూ.1.51కోట్లు

మల్యాల: కొండగట్టు అంజన్న ఆలయంలో ఈనెల 20 నుంచి 22వరకు హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు అన్ని శాఖల సమన్వయం, సహకారంతో విజయవంతమయ్యాయని ఆలయ ఈఓ శ్రీకాంత్ రావు తెలిపారు. కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాలతో మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించామని పేర్కొన్నారు. స్వామివారికి లడ్డూ ప్రసాదం ద్వారా రూ.79,14,200, పులిహోర ద్వారా రూ.10,45,920, దీక్ష విరమణల ద్వారా రూ.30,56,100, కేశ ఖండనం ద్వారా రూ.8,51,450, శీఘ్ర దర్శనం ద్వారా రూ.23,04,800 మొత్తం రూ.1,51,72,470 ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

సౌదీలో తెలుగు సంఘం ఏర్పాటు


శ్రీనివాస్

జగిత్యాలరూరల్: సౌదీ అరేబియాలో తెలుగు అసోసియేషన్ ఫౌండర్ మల్లేశ్ ఆధ్వర్యంలో సాటా రియాద్ చాప్టర్ కోర్ టీంను శనివారం ప్రకటించారు. అధ్యక్షుడిగా మచ్చ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్‌గా నూర్ మహమ్మద్, ఇంజినీరింగ్ ప్రెసిడెంట్‌గా సింగు నరేష్ కుమార్, బిజినెస్ ప్రెసిడెంట్‌గా వీరవెల్లి యోగేశ్వరారావు, టీచర్స్ ప్రెసిడెంట్‌గా మురళిని ఎన్నుకున్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కులం, మతం బేధం లేకుండా అందరం కలిసి కష్టాల్లో ఉన్నా తెలుగువారికి అన్ని విధాలా సహాయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. కొత్తగా ఎన్నికైన కోర్ టీమ్ శహబాజ్, మిధున సురేష్, ముదిగొండ శంకర్, నయీమ్, అయాజ్, ముజామిలోద్దీన్, ఇలియాస్, కోకిల, మంజూష మహేశ్‌కు అభినందనలు తెలిపారు. మల్లేశ్ మాట్లాడుతూ.. నాయకత్వం, అంకితభావంతో పనిచేస్తామని వెల్లడించారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

- సీపీఐ జాతీయ నేత చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

గోదావరిఖని: ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గదర్శి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మావోయిస్ట్ నేతలను ఎన్‌కౌంటర్ పేరిట చంపుతూ పైశాచిక ఆనందం పొందుతోందన్నారు. మావోయిస్ట్ పార్టీ ప్రభుత్వంతో శాంతి చర్చలు జరుపుతామని ఆయుధాలను పక్కన పెట్టి కాల్పుల విరమణ ప్రకటించిన తర్వాత కూడా.. నక్సలైట్ల ఏరివేత కార్యక్రమాన్ని కేంద్రప్రభుత్వం చేపట్టడం హేయమైన చర్య అన్నారు. ఇప్పటికైనా ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతిచర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఉగ్రవాదాన్ని అంతం చేయడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం.. ప్రజల దృష్టి మళ్లించేందుకే ఆపరేషన్ కగార్‌ను చేపట్టిందని ధ్వజమెత్తారు. సీపీఐ జాతీయ మహాసభలు సెప్టెంబర్‌లో చండీగఢ్‌లో, తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఆగస్టులో మేడ్చల్ జిల్లాలో జరుగన్నాయని తెలిపారు. ఈలోగా పట్టణ, మండల, జిల్లా మహాసభలు పూర్తి చేయాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు శంకరన్న, తాండ్ర సదానందం, గోసిక మోహన్, గోవర్ధన్, కె.కనకరాజ్, తాళ్లపెల్లి మల్లయ్య, కొడం స్వామి తదితరులు పాల్గొన్నారు.

పుష్కర స్నానానికి రెండు రోజులే గడువు

- భారీగా తరలివెళ్తున్న భక్తులు
- మంథని నుంచి అదనపు బస్సులు

మంథని: త్రివేణి సంగమ క్షేత్రం కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాలు మరోరెండు రోజుల్లో ముగియనున్నాయి. సోమవారం వరకు పుష్కర స్నానానికి అవకాశం ఉండడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివెళ్తున్నారు. ఇప్పటివరకు లక్షలాది మంది పుణ్యస్నానాలు ఆచరించారు. ప్రైవేటు వాహనాల్లో వెళ్లేవారికి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండడంతో రెండురోజుల నుంచి ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగింది. దీంతో జిల్లాలోని బస్టాండ్‌లు కిక్కిరిసిపోతున్నాయి, మంథని ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఎనిమిది రోజుల పాటు 30 బస్సులను నడిపించగా శనివారం ఇతర డిపోల నుంచి 10 బస్సులను తెప్పించారు. చివరిరెండు రోజులు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో ఆదివారం మరో ఐదు బస్సులను అదనంగా నడిపించనున్నట్లు డిపో మేనేజర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఒక్క మంథని నుంచే రోజూ నాలుగు వేల నుంచి ఆరువేల ఐదు వందల మంది వరకు భక్తులు కాళేశ్వరం తరలివెళ్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 20 వేల మందికి పైగానే భక్తులు ఆర్టీసీ బస్సుల్లో వెళ్లన్నారని అధికారులు తెలిపారు.

ముందుచూపు లేకఇబ్బందులు

సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులను అంచనా వేయడంతో ఆర్టీసీకి ముందుచూపు లేమి కొట్టొచ్చినట్లు కనిపించింది. జిల్లాలోని మంథని, గోదావరిఖని, పెద్దపల్లి ప్రాంతాల నుంచి ఎంత మంది భక్తులు తరలివెళ్తారో ముందుగా అంచనా వేయడంతో విఫలమయ్యారు. గతంతో పోల్చితే ఈసారి భక్తులు అధికంగానే తరలివెళ్లారు. ఇందుకు అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో భక్తులకు ఇబ్బందులు తప్పలేదు.

గ్రామాలకు బస్సులు రద్దు..

పుష్కరాలకు ప్రత్యేక బస్సులను నడుపుతుండడంతో గ్రామాలకు రద్దు చేశారు. గ్రామాలకు నడిచే వాటినే పుష్కరాలకు తిప్పుతున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు వాహనదారులు భక్తుల నుంచి రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్నారు.

క్వార్టర్ల కేటాయింపుపై సింగరేణి విజి'లెన్స్'

- ఆర్జీ–1 ఏరియాలో కూపీలాగుతున్న అధికారులు
- పైరవీలతోనే అలాట్ చేశారని ఆరోపణలు



గోదావరిఖని: సింగరేణిలో సీనియర్లకు కాకుండా అనర్హులకు క్వార్టర్లు కేటాయించారనే ఫిర్యాదులపై విజి'లెన్స్' ఆరా తీస్తోంది. అర్హులైన కార్మికులకు క్వార్టర్లు దక్కకుండా పైరవీకారుల సూచనలతో అనర్హులకు కేటాయించారనే ఫిర్యాదులతో రంగంలోకి దిగిన సింగరేణి విజిలెన్స్ అధికారులు.. విచారణ వేగవంతం చేశారు. ఇటీవల ఎన్నిక్వార్టర్లు కేటాయించారు? ఎంత మందికి కౌన్సెలింగ్ ద్వారా కేటాయించారు? ఎన్నిక్వార్టర్లు పైరవీలతో కేటాయించారు? అనే అంశాలపై లోతుగా విచారణ జరుపుతున్నారు. ఈమేరకు శుక్రవారం ఏరియా క్వార్టర్ల కేటాయింపు ముఖ్య అధికారి చాంబర్‌లో విజిలెన్స్ అధికారులు సుమారు గంటపాటు కూపీలాగినట్లు తెలుస్తోంది. అయితే అధికార పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రుల పైరవీ లెటర్లతోపాటు స్థానిక కార్పొరేటర్ల ఒత్తిడి మేరకు ఏరియాలో భారీగా క్వార్టర్లు కేటాయిచారనే ప్రచారం జరుగుతోంది. దీనిపై విజిలెన్స్‌కు ఫిర్యాదులు అందడంతో రహస్యంగా విచారణ చేపట్టినట్లు చర్చ జరుగుతోంది. అయితే అధికారి పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు లొంగి తాము ఇబ్బంది పడుతున్నామని అధికారులు వాపోతున్నట్లుగా తెలుస్తోంది. పూర్తిస్థాయిలో విచారణ జరిపిన విజిలెన్స్ అధికారులు నేరుగా ఎన్ని క్వార్టర్లు కేటాయించారు? దానికి పైరవీ లెటర్లు, పూర్తి వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం క్వార్టర్ల కేటాయింపునకు సంబంధించిన ఫైళ్లను వెంట తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

సీనియర్లకు మొండిచేయి..

సింగరేణిలో సీనియారిటీ ప్రాతిపదికన క్వార్టర్లు కేటాయిస్తున్నారు. ప్రతీనెల లేకుంటే మూడు నెలలకోసారి కౌన్సెలింగ్ నిర్వహించి క్వార్టర్లు కేటాయిస్తున్నారు. అయితే సీనియర్ కార్మికులు తమకు నచ్చిన క్వార్టర్ ఎంపిక చేసుకుంటే ఆ క్వార్టర్ కౌన్సెలింగ్‌కు రాకుండానే కేటాయిస్తున్నారని అంటున్నారు. చాలా క్వార్టర్లు ఇలాగూ కేటాయిస్తుండడంతో కార్మికులు అసంతృప్తికి లోనవుతున్నారు. విజిలెన్స్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు.

ఉగ్రవాదాన్ని అంతమొందించాలి

కరీంనగర్: దేశంలో ఉగ్రవాదాన్ని తుదముట్టించి, మతసామరస్యాన్ని కాపాడాలని, ఛత్తీస్‌గఢ్‌లో ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సుగుణాకర్‌రావు భవన్‌లో పుచ్చలపల్లి సుందరయ్య వర్థంతి వారోత్సలు నిర్వహించార. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడి, అనంతర పరిణామాలు అంశంపై సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అధ్యక్షతన సెమినార్ జరిగింది. వీరయ్య మాట్లాడుతూ, పహల్గాం ఉగ్రదాడి దిగ్భ్రాంతికి గురిచేసిందని, అయితే, ఒక మతానికి వ్యతిరేకంగా మోదీ పరివారం సోషల్ మీడియాలో ప్రచారం చేసిందని, ఇది దేశ ఐక్యతను దెబ్బతీస్తుందన్నారు. కశ్మీర్ ముస్లింలే పర్యాటకులను కాపాడారని, రైల్వే, ఎయిర్‌పోర్టులకు ఉచితంగా పర్యాటకులను చేరవేశారన్నారు. అదే కార్పొరేట్ శక్తులు ఎయిర్‌లైన్స్‌లో రూ.6 వేలు ఉన్న టిక్కెట్‌కు రూ.60 వేలకు పెంచారన్నారు. ఈ ఉగ్రదాడిలో ఒకముస్లిం హార్స్ రైడర్ చనిపోయారన్నారు. తామంతా ఒకటిగా ఉన్నామని అక్కడి ముస్లింలు నినదించిన విషయాన్ని మర్చిపోకూడదన్నారు. యుద్ధంతో ఉగ్రవాదాన్ని అణచివేసిన ఉదంతాలు ప్రపంచంలోనే లేవన్నారు. కాల్పుల విరమణ తర్వాత ట్రంప్ వైఖరిపై మోదీ నోరు మెదపలేదన్నారు. ఉగ్రవాదుల అంతు తేల్చామని ఒకవైపు ప్రధాని చెబుతున్నారని, నేటికీ ఒక్క ఉగ్రవాదిని కూడా పట్టుకోలేదన్నారు. కాల్పుల విరమణ తర్వాత అఖిలపక్ష సమావేశాన్ని ఎందుకు నిర్వహించలేదని, ఉగ్రదాడి అనంతర పరిణామాలపై పార్లమెంట్లో ఎందుకు చర్చించలేదన్నారు.

కొనుగోళ్లలో జాప్యంపై పురుగు మందు డబ్బాతో రైతు నిరసన

సారంగాపూర్: సారంగాపూర్ మండలం లచ్చక్కపేటలోగల ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోలు జాప్యాన్ని నిరసిస్తూ.. ఓ రైతు క్రిమిసంహారక మందు డబ్బాతో నిరసన తెలిపాడు. కేంద్రంలో ధాన్యం పోసి 15 రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయడం లేదని నిరసనకు దిగగా.. కేంద్రం నిర్వాహకులు తనను అసభ్యంగా దూషించారని రైతు మల్లయ్య ఆరోపించాడు. వర్షానికి ధాన్యం మొలకెత్తిందని, అయినా ధాన్యం కొంటలేరని, నిర్వాహకులు ఇబ్బందులు పెడుతున్నారని వాపోయాడు. ఒక దశలో పురుగుల మందు తాగడానికి ప్రయత్నించాడు. అక్కడున్న రైతులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై దత్తాద్రి అక్కడికి చేరుకుని మల్లయ్య, కేంద్రం నిర్వాహకుడు సత్యనారాయణతో మాట్లాడారు. మల్లయ్య ధాన్యం కొనుగోలు చేయించడంతో సమస్య సద్దుమనిగింది.

సింగరేణిలో మైనింగ్ అధికారుల బదిలీ

గోదావరిఖని: సింగరేణిలో అధికారులను బదిలీ చేస్తూ ఆదేశాలు శనివారం జారీచేసింది. సీఆర్‌పీ/పీఈఆర్/సీ/26/1688 పేరిట జారీచేసిన సర్క్యులర్ ప్రకారం.. సంస్థ వ్యాప్తంగా 32మందికి స్థానభ్రంశం కల్పించింది. వీరంతా వచ్చేనెల 4లోగా బదిలీ అయిన స్థానాల్లో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

బదిలీ అయిన అధికారుల వివరాలు..

అధికారి	హోదా	ప్రస్తుతస్థానం	బదిలీస్థానం
కె.చంద్రశేఖర్	డీవైజీఎం	ఆర్జీ–1	మణుగూరు
ఎం.రాంమోహన్	డీవైజీఎం	ఆర్జీ–3	ఎస్‌వోటూ జీఎం ఆర్జీ–3
బి.శ్రీనివాసచారి	డీవైజీఎం	మణుగూరు	ఏవో, ఆర్జీ–1
డి.రామస్వామి	డీవైజీఎం	సేఫ్టీ	ఎస్‌వోటూ ఇల్లెందు
బి.మాధవరావు	డీవైజీఎం	ఎంఆర్ఎస్	పీవో, నైనీ
బి.కృష్ణప్రసాద్	డీవైజీఎం	కేటీకే ఓసీ–2	పీవో, గోలేటి
విజయ్‌కుమార్	డీవైజీఎం	ఎస్ఆర్‌పీ	ఏఎస్‌వో, ఎస్ఆర్‌పీ
ప్రసాద్‌రావు	డీవైజీఎం	కేటీకే ఓసీ–3	ఏఎస్‌వో, ఆర్జీ–3
ఇ.శ్రీనివాస్	డీవైజీఎం	కేటీకే ఓసీ–3	పీవో, కేటీకే ఓసీ–3
జాకీర్‌హుస్సేన్	డీవైజీఎం	కేటీకే–5	ఏఎస్‌వో, ఇల్లెందు
జి.రాజేందర్‌రెడ్డి	ఎస్‌వోఎం	ఎంఆర్ఎస్	ఎంఆర్ఎస్, ఆర్జీ–2
జి.కల్యాణ్‌రామ్	ఎస్‌వోఎం	పీకే ఓసీ	జేవీఆర్ ఓసీ–2
దుర్గాప్రసాద్‌రావు	మేనేజర్	జేవీఆర్ ఓసీ–2	కేటీకే ఓసీ–2
ఆత్మరామ్	అడిషనల్ మేనేజర్	ఐకే–1ఏ	ఎస్ఆర్‌పీ–1
ఎ.నారాయణ్	అడిషనల్ మేనేజర్	ఖైరి ఓసీ	కేటీకే–5
టి.మధుసూదన్	అడిషనల్ మేనేజర్	కేటీకే–1	కేటీకే ఓసీ–3
ఖమారుద్దీన్	అడిషల్ మేనేజర్	ఎస్ఆర్‌పీ ఓసీ–2	వీటీసీ, ఎస్ఆర్‌పీ
కె.సాంబశివరావు	అడిషనల్ మేనేజర్	ఆర్జీ–1	ఎస్ఆర్‌పీ ఓసీ–2
ఎస్.సుభాష్	అడిషనల్ మేనేజర్	ఓసీ–3	క్వాలిటీ, ఆర్జీ–2
ప్రసాద్‌కుష్వా	అడిషనల్ మేనేజర్	కేటీకే–5	నైనీ ఓసీ
ఎం.లింగబాబు	అడిషనల్ మేనేజర్	పీకే ఓసీ	జేవీఆర్ ఓసీ–2
ఎస్.సునీల్	అడిషనల్ మేనేజర్	ఖైరి ఓసీ	కేవోసీ, ఇల్లెందు
బి.రాజేశ్‌బాబు	అడిషనల్ మేనేజర్	ఎస్ఆర్‌పీ–1	ఖైరి ఓసీపీ
ఎస్.భాస్కర్‌రెడ్డి	అడిషనల్ మేనేజర్	ఎంఆర్ఎస్	ఓసీపీ–3
కుమారస్వామి	అడిషనల్ మేనేజర్	కేటీకే ఓసీ–3	క్వాలిటీ భూపాలపల్లి
బి.విజయ్‌కుమార్	అడిషనల్ మేనేజర్	ఓసీ–2	క్వాలిటీ, బెల్లంపల్లి
ఎ.శ్రీకాంత్	అడిషనల్ మేనేజర్	కేవోసీ	ఎస్ఆర్ ఓసీ–2
అరవింద్‌కుమార్	డీవైమేనేజర్	ఏఎల్‌పీ	నైనీ ఓసీ
విశ్వనాథరెడ్డి	ఎస్ఈ	ఓసీ–3	వీటీసీ ఆర్జీ–2
జి.రవి	డీవైఎస్ఈ	క్వాలిటీ	క్వాలిటీ కార్పొరేట్
పంకజ్‌కుమార్	అండర్ మేనేజర్	పీవీకే–5	నైనీ ఓసీ
ప్రదీప్‌కుమార్	అండర్ మేనేజర్	ఎస్‌కే	క్వాలిటీ, మందమర్రి